# పాడుసంఘం ★

రచన :
"వీరసూరి"

సహృదయ తనహృదయంలో ఇన్నాళ్లబట్టి అణగి మణిగి తనకి దాసోహం చేస్తాయేమోనని తాపత్రయపడి చివరికి తనే వాటికి లొంగిపోతానేమో అన్న దిగులుతో ధైర్యంగా పందెంలో పుంజులా వాటితో దెబ్బలాడుతూనే వుంది. ఆ ఆలోచనలు పూర్తిగాపోవు. పైకొస్తే చెప్పలేనంత బాధను కలిగిస్తున్నాయి.

అర్ధరాత్రి ఆకాశాన్నంతా మేఘాలు దట్టంగా కౌగలించుకొన్నాయ్. మనిషిని మనిషి తెలుసుకోలేనంత చీకటి—గాఢాంధకారము ఒక్కతారైనా కనపడ్డంలేదు. పెద్దపెద్ద ఉరుములు. ఫ్లాష్‌లైట్లలా మెరుపులు, హోరునవర్షం.

అతను వెళ్ళినతరువాత ఒక్కసారిగా వాతావరణం మార్పులు చెందింది. ఆ కారణంచేత వాతావరణ పరిస్థితులు మారి తుపాను తగ్గితేనేగాని తన ప్రయాణం సుకరంగావుండదని ఆగిపోయింది. జీవనదిపైనున్న జిల్లాలలో వర్షాలధికంగా కురియుటవల్ల పండినపంట కుప్పలు నదిలో కొట్టుకొనిపోయాయి. ఇప్పుడా నది దిగువ భాగంలో యీ రెండురోజులబట్టి వర్షాలెడతెరిపి లేకుండా కురుస్తూంటే వృద్ధులు భయంచే వణుకుతున్నారు. అరవైఏండ్ల క్రిందటి దృశ్యం వారికళ్లలో కట్టినట్లైంది.

ఓ విషువత్సంక్రాంతినాడు ఇప్పట్లానే తుపానుగాలివీచి, నదివరదలొచ్చి, పట్టణాన్ని సగంమ్రింగి, అదిచాలక పల్లెలకూ పట్టణానికీ మధ్యనున్న వంతెనను తనలో కలుపుకొని ఎంతమందినో విచారపూరితుల్ని చేసింది.

పిల్లలిదివరకు నదివరదలచే తామువిన్న అనుభవములను చర్చిస్తూ ఇప్పుడేంజరుగుతుందోనని వుత్సాహంతోనూ, వుల్లాసంతోనూ ఎదురు చూస్తున్నారు. ప్రొద్దుటకు దీని ఉద్రిక్తము తగ్గుననే ఆశతో వున్నారు జనం. నదిగట్టు కొట్టుకొనిపోతుందేమో అన్నంత వేగంగా కెరటాలు వస్తున్నాయి.

ప్రశాంతంగా అందరూ నిద్రాదేవికి వశులయ్యారు. ఎవరో కొందరు భగ్నజీవులూ, భయకంపితులూ నిద్రాదేవిని జయించేరు. అలాంటి భగ్నజీవులలో సహృద యొకర్తి.

ఆమెకెదురుగా బల్లపైనున్న జాబును ఆ గుడ్డిదీపపు వెలుతురులో చూస్తోంది. ఆ ఉత్తర మారోజునే వచ్చింది. అదే ఆమెనిట్లా చేసింది.' ఎవరితోనూ మాట్లాడకుండా, పూర్వపుదృశ్యాల్ని జ్ఞాపకంచేసి మనసుకు బాధ కలిగించింది. తనచుట్టూ ఏంజరుగుతోందోకూడా తెలియనిస్థితిలో వుందామె. అనేకాలోచన లామెబుర్రలో చక్రాల్లా తిరుగుతున్నాయి. ఈ అంధప్రపంచంలో, ఈ బానిసదేశంలో, ఈ నీచప్రపంచంలో ఇక తన జీవితానికి నీరాజన మర్పిద్దామనుకుంది. రెండురోజులక్రితమే ఆమె ఎచ్చటికో పోదామని ప్రయత్నించింది కాని దానికి కొన్ని విఘాతాలు కలిగేయి. ఈలోపుగానే వచ్చిన తుపాను, తను పరపురుషునితో తిరుగుతూంది కులట, సంఘానికి వ్యతిరేకించింది అని లోకం పాడుస్తున్నా కుక్కల్లా మొరిగినా, తన్ని ఇంట్లోంచి తరిమివేసినా ఎంతచేసినా తనయింట్లో వుండమని తనకాశ్రయమిచ్చిన సత్యం మాటను తీసివేయలేకపోయింది. ఈ మధ్య మళ్ళీవింది. సత్యం తనయింట్లో పెట్టుకున్నాడని వేధించుకు పీక్కుతింటోంది లోకం. అనవసరంగా తన్ని గురించి యితరులు బాధపడటం ఆమెకి కంటకప్రాయంగా వుంది. తననా యింట్లోంచి గెంటేశారు. తన ప్రేమికుడైన మూర్తిని ఎక్కడికిబోకుండా అరికట్టేరు. అయినా ఒక్క


3 మాసములలో ఇంగ్లీషు నేర్చుకోవచ్చు.

ఆనంద ఆంగ్ల భాషాబోధిని

728 పేజీలు 16 నిండు చిత్రముల పేజీలు

తెనుగుతెలిసిన మీరు స్వయముగ మూడు మాసముల ఆంగ్లమును వ్రాయను, చదువను మాట్లాడను నేర్చుకొనగలరు.




వ్రాత, ఉచ్చారణ అన్నీ స్వయముగ మీకు సావకాశము గల సమయములందు దినమున కొక గంటవంతున చదువుచు నేర్చుకొనగలరు. ఈ దినములందు ఆంగ్లపరిచయ మవసరము. అవకాశమున్న సమయమున యిటు లుండరాదు. ఒక మహాభాషనింతసులభముగ తెలుపగల 728 పేజీలగ్రంథ మేది? ఆనంద ఆంగ్ల భాషాబోధిని.

నేడే యీ గ్రంథమును తెప్పించి ప్రారంభించి భాషా పరిచయము కలిగించుకొనుడు.

గ్రంథము వెల 4 రూపాయలు. పోస్టేజి వేరు.

ఆనందబోధిని ఆఫీసు,
నెం. 6, లాయర్ చిన్నతంబిమొదలి వీధి, మదరాసు.

సారి చూచిపోవడానికి వచ్చేవాడు, మొన్నవచ్చేడు, ఈ వెధవసంఘం ఇద్దర్నీ దూరంచేసింది. దీనిఫలితం అనుభవింపకుండా ఉంటుందా ?

సత్యానికి సంఘపరిస్థితి అంతా అర్థమైంది. ఒక్క అనాథకి, స్నేహితురాలికి ఆశ్రయమిస్తేనే ఇంతగొడవపెడుతున్నారే! తమ ఇళ్లలోజరిగే అవినీతి కార్యాలను ఎందుకు చూసుకోరు! మానసిక దౌర్బల్యం, దేశదౌర్భాగ్యం. ఇంక ఇక్కడ సహృదయనుంచితే ఆమె నీ పాడుసంఘం బ్రతకనివ్వదని తలచి ఆమె నింకోవూరు పంపేయదలచుకున్నాడు సత్యం! ఆత్మగౌరవంగల ప్రతిమనిషీ ఇలాంటి విషయాల్లో కొంచెం విచారిస్తాడు. అలాగే సత్యం విషయంకూడా! చెప్పలేక చెప్పలేక ఆమె యిచ్చట వుండినట్లయితే దెబ్బలాటలు పెరిగి జీవితానికి వినాశన మొస్తుందనీ, అందుచేత తన స్నేహితునివద్దకు వెళ్ళివుండమనీ చెప్పాడు. పాపం! సహృదయ వణికేకంఠంతో ఇప్పటిదాకా రక్షించినందుకు కృతజ్ఞురాలను అనేసి తన గదిలోని కెళ్ళిపోయింది వణికే కాళ్ళతో.

ఇంక కొత్తప్రపంచంలో కెళ్ళాలి. ఏదో వింత జంతువును చూచినట్లు చూస్తారక్కడ ప్రజలు. క్రొత్తజీవితం సాగించాలి. అందులోనుంచి ఉద్భవించే క్రొత్తభావాలకు స్థానం ఇవ్వాలి. అంతా క్రొత్త-క్రొత్త ఆలోచనలలో, మాటలకందని మౌనంలో భాషకందని-భావౌన్నత్యంలో, చచ్చిన పక్షి రెక్కల్లా ఆమె ఆలోచన లామెకు అలసట చెందించేయి. ఇల్లులేదు-వాకిలిలేదు-తినడానికి తిండిలేదు-ఆర్థిక సహాయంలేదు. ఇప్పటిదాకా కాపాడిన సత్యం తన్ను వెళ్ళిపొమ్మనే పరిస్థితి ఏర్పడింది. ఇంత అధైర్యపడితే ఆమె భావి జీవితం ఎలా గడపగలదు? ఎవళ్లామెను కాపాడుతారు? ఆమె భగ్నహృదయంలో మండేజ్వాలలకు నేయిని తోడిచ్చి ఇంకా మండింపజేసే యీపాడులోకం యీనీచసంఘం, ఆమె కష్టాలను కొంచెం తను కూడా పంచుకోరాదూ?

అలా ఎందుకు చేస్తుంది. దానికి విమర్శించడమే తెలుసు. అదే ఉగ్గుపాలతోనూ నేర్చుకొంది. దీని కసలు అంతమంటూవుంటే పుర్రెతోపుట్టిన బుద్ధి పుడకలతోగాని పోదన్నట్లు, నాశనమైయేక పోతుందేమో? ఎవరు చెప్పగలరు. భగవంతునే మాయచేస్తున్నాం అనుకునే సంఘానికిదొక లెక్కా?

ఇది తుపాను ప్రారంభమయిన మూడవరోజు. ఈ రోజునే ఆమెకుత్తరం వస్తే అదే చూస్తోంది. కామశాస్త్రి దగ్గర్నుంచి వచ్చిన జాబది. ఈమెకు తాను వచ్చినట్లు స్నేహవుత్తరం వ్రాసి నమ్మకమైనవానికిచ్చి పంపేడు. అదో ప్రేమలేఖ. తనవిరహబాధలు, తనప్రేమని, వెళ్లగక్కుతూ వ్రాసిన లేఖ అమె కదో దరఖాస్తు.

ఆమె ఆజాబు చదువుతూంటే పూర్వపు దృశ్యాల్లోకి తీసుకెళ్ళింది. తన ప్రేమైకమూర్తితో గడిపినరోజులు, అతనికై పరితపించిన దినాలు, తన సర్వస్వం ఆమెకై ధారపోసే అతని త్యాగబుద్ధి, ప్రపంచంలో ఏ ఏ పురుషుడూ ఏ స్త్రీకి యివ్వలేని బ్రహ్మానందం ఇచ్చి, అమరత్వంలోనికి తీసుకొనిపోయిన తన ప్రణయాధిదేవత, ప్రాణప్రియుడు, మనస్సాక్షిగా పెండ్లిచేసుకున్న భర్త, మూర్తి జ్ఞాపకం వచ్చేడు.

"కొందరు నీవు సత్యాన్ని పెండ్లిచేసుకొంటున్నావనీ చెప్పేరు. నే నదే కనక నమ్మేట్లయితే ఏమయేదో తెలుసా సహృదయా! నీమీదలాగే నామీదకూడా లేనిపోనివి కల్పించి కష్టపడి అల్లి, అనేక కథలు నీతో చెప్పేవారు. నేరు తిరుగుతున్నానని చెప్పొచ్చు. కాని నేను నీకోసమే ఎదురుచూస్తున్నాను—నీవు నన్నెక్కడ వదిలేవో అక్కడే వున్నా; జీవితం నాశనమౌతుందేమో! ప్రియతమా! నీకోసం నేను పడుతూన్న విరహబాధలో సగంకూడా యెవరూ పడివుండరని ఘంటాపథంగా చెప్పగలను. నాచుట్టూవున్న ప్రపంచంలో ఏం జరుగుతుందో తెలియడంలేదు.

"సఖీ! హృదయంలోమండే జ్వాలలదగ్గరకు ఎవరు రాగలరు. నన్ను నీదగ్గరకు పిలవ్వూ! జీవితం రసమయం చేయవూ! నేనేం చేస్తున్నానో, ఏం రాస్తున్నానో తెలీడంలేదు. ప్రేమభిక్ష పెట్టవూ! నీవు లేకుండా నేను జీవించలేనని ధృవపడిపోయింది. రమ్మని వ్రాయవూ!—రెండు రోజుల్లో వాల్తా! ప్రేమసీ! నన్ను మరచిపోయావా! మన చూపులు జ్ఞాపకం లేవూ! మనమాటలు ఏమయ్యాయో! ప్రియతమా మరచేవా? యీ దీనుణ్ణి!"

అది చదవగానే సహృదయకు నిశ్చలమైన నిజాకర్షణ ఇప్పుడే తనలో మొలకెత్తినట్లు భావించింది. పర్వతగుహలోకి పోనుపోను దోవ ఇరుకై, ఊపిరాడక అలసి, సొలసిన మానవుడికి చప్పునొక్కసారి వెల్తురుపడితే ఎలాగుంటుంది? కోర్కెలను బాధతోదాచినా వాటికి పీడనశక్తి హెచ్చినప్పుడు బాధపోయేవరకు కొన్నిటిని చంపేయాల్సివస్తుంది.

అలా ఎన్నిగంట లాలోచించిందో ఆమెకే తెలియదు. ఇంత దెబ్బలాటా వృధా అయిపోయింది. ఇన్నిగంట లాలోచన్లు ఓమూలకు నెట్టివేయబడ్డాయి. శాస్త్రి తన ఎదుట నించొని ప్రేమభిక్ష పెట్టమని పీడుస్తూ అడుగుతూన్నట్టనిపించింది. ఆమె యింకా జాబుని చదవలేకపోయింది. అతడొచ్చి చెప్తున్నట్టనిపించింది. మాటలకు కంపించిపోయింది. మొన్నటిదాకా తన భావిజీవితం ఒంటరిగా ఎలా గడుస్తుందనే దిగులు, దానికోసం ఆలోచించిన ఆలోచన్లు, ఇక

మీదేం భారంపడుతుందోననే భయం, వీనితో ఆమె జీవచ్ఛవంలాగుంది. ఇప్పుడు ఆమెకు దగ్గరగా ప్రేమభిక్ష పెట్టమని అరుస్తూన్న ఆరాధకుని అరపులు ఆమెపై కొంత అధికారాన్ని కలిగించేయి. ఒక క్రొత్తజీవితం తనకెదురుగా కనపడుతోంది. దృఢమైన సహనము, ప్రయత్నము, మార్పు, ఇంకొకరిపై ప్రేమ ఇష్టత ఏర్పడి ఆమె హృదయంలో బ్రహ్మానందం జేరినా ఘోరమైన కోర్కెలను పుట్టించలేకపోయింది. ఆమెకేదేనా ఆనందం కలిగిందంటే అది ప్రేమార్థకుడైన శాస్త్రి ఏడుపుకి. బాలితోగూడిన హృదయంకలదై 'రమ్మని' వ్రాసింది. కాని ఆమె అంతరాత్మని మోసగించలేకపోయింది. ప్రాణప్రియుడైనమూర్తిని మోసం చేస్తున్నాననే బాధతో క్రుంగిపోయింది. పూర్వపుచేతలు జ్ఞాపకానికి వచ్చేయి. మానసిక దౌర్బల్యం! ఆత్మవంచన చేస్తున్నానని తెలుసుకుంది. ఆనందంలోంచి తీసుకుపోయి అమరత్వంచూపిన జ్యోతి ఆమె హృదయంలో మెరసింది. ఆమె కులటనని తేల్చుకుంది. ఏడ్చింది. అలాగే నిశ్చలంగా కూర్చుంది. మనస్సు కుదుటపరుచుకొంది. ఏ విధాన్నైనా శాస్త్రి మాటను మరవాలనుకుంది. మూర్తిని క్షమించమని ప్రార్థించింది. పూర్వపుచేతలు, మాటలు, మెదడుని నింపేయి. దానితో ఆత్మవంచనచేయలేనంత జాలి, ప్రేమ, మనోనిశ్చలత ఏర్పడినై. తాను చిన్నప్పుడు చదివిన మాటలు, మూర్తితో గడపిన దినాలు, వరుసగా జ్ఞాపకానికి వస్తూంటే తనకు తెలియకుండా తన్ని నెమ్మదిగా, అతి నెమ్మదిగా మాట్లాడేటట్లు చేసాయ్. కానలిబయట కురుస్తున్న వర్షపు ధ్వనిలో లీనమైపోయేయ్. ఆమె సర్వస్వాన్ని, ప్రపంచాన్ని మరవగలదేమో గాని మూర్తిని మరువలేకుండా వుంది. ఎందుకంత వ్యామోహం? ఇటు అన్నకు తల్లికి యావత్ప్రపంచానికి అసహ్యపదార్థమై కులటని వేలెత్తి నలుగురుచేతా చూపెట్టుకొనేకంటే అతన్ని మరుస్తే ఏ గొడవ వుండదుగా? కాని అతన్ని మరవాలనుకొన్నకొద్దీ అతనిమీద మమకారం పెరుగుతోంది. ఆనాడతనన్నమాటల్ని మరువగలదా? "మనిద్దరకూ కర్మసాక్షిగా వివాహం ఐపోయింది కదూ! హృదయేశ్వరీ! నా యావజ్జీవితం నీకు ధారపోసేను. నీ నుంచి తీసుకొన్న సందేశాన్ని నా హృదయంలో దాచుకొన్నాను. నే బ్రతికుండగా వాటిని మరువలేను ప్రేయసీ!' అని అతడన్న ముక్కలు జ్ఞాపకానికి వచ్చాయి. వెంటనే ఆమె నోటంట అప్రయత్నంగా మరచిపో! శాస్త్రీ! నన్ను మరచిపో! ఈ అబలని కులటని మరచిపో. నీవెక్కడ్నించి వచ్చేవో అక్కడికే పో!" అనేసి అతని జాబుని అగ్నిఆహుతి చేసింది. మూర్తిని మోసంచేసినందుకు ఆమె హృదయం పరితపించింది. "జన్మలో మరువను" అని అనుకుంటూ ఆవేదన భరింపలేక కంటివెంట నీళ్ళుకారుస్తూ ఎదురుగా వున్న టేబిల్‌పై తలపెట్టుకొని ఇటూ అటూ పొర్లుతోంది. ఆమె హృదయం జాలితో నిండిపోయింది. మానవ జీవితంలోని రహస్యం కనిపెట్టింది. ఆత్మవంచన చేసినవాళ్లెలా బాధపడతారో గ్రహించి నేనింకా బ్రతికుంటే శాంతినివ్వుమో భగవంతుడా! అని ప్రార్థించింది.

ఆమెకాళ్లకు చల్లగా తగిలినవెంటనే వులిక్కిపడి చూసింది. ఆమె కాళ్లక్రింద నీరు పారుతోంది. తలుపులను తోసుకొని నీరు పారుతోంది. ఆశ్చర్యంగాని, భయంగాని ఆమె ప్రకటించలేదు. కారణం? అది వరదని ఆమెకు తెలుసు. ఆమెకిందటి పండ్రెండు గంటలబట్టి పడుతున్న ఆవేదన మనస్సుకి ఇప్పుడు శాంతిచేకూరినట్లు భావించింది.


## జీవానందరసాయనము

ఊరుపిచ్చుకల సత్తుతో ఫలరసములతో మలయాళ పద్ధతిలో తయారుచేయబడినది. స్త్రీ పురుషులకు గలుగు అన్ని వ్యాధులకు ఇది దివ్యౌషధము. రుచికరమైనది. పథ్యములేదు. సర్వకాలములందు యెల్లరు భుజింపదగినది.

జీవానందరసాయనమును పుచ్చుకొనిన జీవనరములలోచేరి వచ్చిన మేహ దుర్నీరు నశించును. స్త్రీ సంభోగముచే నేర్పడిన తెలుపు కాక, గ్రంధి, మేహవ్యాధి, మేహదురద, పిత్తపాండు, క్షయ, కాసలను పోగొట్టును దీనితోసాటి వేరొకటి లేదు. దురభ్యాసమువలన (హస్తప్రయోగాదులచే) గుహ్యావయము దుర్బలమై చిక్కిపోవును. వేడి, బలహీనము, ధాతునష్టము, స్వప్నస్ఖలితము, నరముల బలహీనత, ఆయాసము, దేహభీతి, ఆకలిలేకుండుట, మలబద్ధకం, గుల్మము, అజీర్ణం, నిద్రలేకుండుట, మేహకాక, రక్తముచెడుటచే గల్గు వ్యాధులు, మూలకాక, గుండెదడ, వెన్నునొప్పి, దగ్గు, ఇంద్రియము నీరై మూత్రములో పోవుట, స్త్రీలకడకుచేరినను తలచినను వెంటనే స్ఖలితమైపోవుట సంభోగచింత గలగనే తనకు తెలియకనే ఇంద్రియముపోవుట, కాలు చేతుల బలహీనత, జ్ఞాపకశూన్యము, దృష్టిమాంద్యము, మొదలైన లెక్కలేని వ్యాధులను పోగొట్టి, వీర్యవృద్ధి, ధాతుపుష్టి, రక్తవృద్ధి, భోగశక్తిని అపారముగ గల్గించును. శక్తివిహీనమై దుర్బలమైన గుహ్యావయవమునకు బలమునిచ్చి వృద్ధిచేసి రక్తకండరములను పెంపొందించును. సాటిలేని సంభోగానందమును గల్గించును. స్త్రీలకు గలుగు ఋతుదోషము, రక్తము అధికముగ స్రవించుట, సంతానాధిక్యమువలన దేహము కృశించుట, మర్మావయవము కృశించుట, బలహీనము, మర్మస్థానమున దురద, మంట, నొప్పి, వేడిచే తెలుపుకారుట, చర్మ సంబంధమైన మేహవ్యాధులు మొదలైన అనేక వ్యాధులను ఖండించి దేహమునకు, పుష్టి, బలము, కాంతిని కల్గించును. ½ పౌను టిన్ను 1-కి 2-12-0 తపాలాచార్జి 0-12-0

ధనలక్ష్మి అండు కో., సౌకారుపేట పోస్టు, మదరాసు.

దీపం పుచ్చుకొని ఒక్క పరుగుతీసింది మేడమీద సత్యం గదిలోకి. అతని బుజం పట్టిలేపి వరదొచ్చేసిందని చెప్పింది.

ఇంట్లోకొచ్చేస్తోందినీరు. పాపం! సత్యం భార్య పిల్లల్ని పట్టుకు ఏడుస్తోంది. ఈలోపున సహృదయ క్రిందకిళ్ళింది. ఓ పెద్దచప్పుడు - రెండు పడవలు కొట్టుకొచ్చేయి. సత్యం రా! పడవలని కేకేసింది. అతడలాగే వచ్చి పడవెక్కేడు. వదిన, ఇంకోపడవలో. సహజంగా ప్రాణాపాయసమయానికి తతిమ్మావారిని లెక్కచెయ్యరు! ఎవరి ప్రాణంవారికి తీప న్నట్లు సత్యం ఒక్కడే వచ్చి పడవెక్కేడు. జాగ్రత్తగా నడుపుకొంటున్నారు పడవల్ని. సత్యం ఏదో చెప్పబోతు న్నాడు. సహృదయ సమాధానం చెప్పలేకపోయింది. ఇంకో పెద్దకెరటం వచ్చి కొన్ని ఇళ్ళు కూలిపోయాయి. సుహృ దయ చలించలేదు. మాట్లాడకుండా పోతున్నారా లోకా నికి పాపం! ఆమెలో భయం ప్రవేశించింది. అకాళరాత్రిలో ఆమె భగవంతునిపై భారంవేసింది.

అంత కనుమూసి కను తెరచేలోగా జరిగిపోయింది. ఆమె కేంచెయ్యాలో తోచలేదు. పైనుంచి ఉరుములు, మెరుపులు—వర్షం — మూర్తిని రక్షిద్దాం అనే దృఢసంకల్పంతో వెళుతోంది. మధ్య మధ్య పెద్దచెట్లు మానులు కొట్టుకొస్తున్నాయి. ఆ విసురికి బోటు తలక్రిందలైనంత పనైంది, కానామె మానుని గట్టిగాపట్టుకొని మళ్ళా బోటులోకెక్కింది ఆశ్చర్యం! విచారం! అన్ని ఒక్కసారి కలిగేయి. సత్యం మాయమయేడు. ఈ అనంత సముద్ర గర్భంలోకి పోయాడు. కానామె విచారాన్ని అణచిపెట్టుకొని తన సంకల్పం సిద్ధించాలనే పట్టుదలతో అలాగేపోతోంది. పూర్వం తాము నడచిన ప్రదేశాలు చూసి బ్రహ్మానందం అనుభవిస్తూంది. కాని తన కుటుంబం ఎంత బాధపడుతోందో, తన మూర్తి ఏమైపోయాడో అన్న దిగులుతో, ఆలోచన్లతో బాధపడుతూ పోతోంది. కెరటాలు జోరుగా వస్తున్నాయ్. ఆఖరుకు తన ప్రియుని మందిరం కనిపించింది. చుట్టూ నీరు. తనపడవ నక్కడకు తీసుకెళ్ళకుండా వుండలేకపోయింది.

వెళ్ళింది మూర్తి సహాయంకొరకు. ఎదురుచూస్తున్నాడు మూర్తి! త్వరగా రా, అని అరిచింది. అతనొచ్చేడు. సహృదయా! ఒక్కర్తివి వచ్చేవా! అన్నాడు. ఏం! భగవంతుడు నన్ను రక్షిస్తున్నాడు. దబ్బున ఎక్కు పడవ. ఎవళ్ళూ లేరా! అని ఎక్కేడు. తన ప్రియునిదగ్గర తానున్నానన్న ఆనందం ఆమెని వెర్రిగా చేసింది. ఇద్దరూ నడుపుతున్నారు పడవని. ఎదురెదురుగా కూర్చున్నారు. ఒకరికొకరు ఏమి మాట్లాడుకోవాలో అర్థం కాలేదు. పూర్వపుచేతలు, వారిని సిగ్గుతో ముంచేయ్. సహృదయా! ఎంతో ఆప్యాయంగా పిలిచిన పిలుపది.

ఆమె మాట్లాడలేకపోయింది. మూర్తీ! ఎంతో బాధతో అంది. వాళ్ళిద్దరు భయంకరమైన ఆనదిలో వెళుతున్నారు. ఉరుములు — మెరుపులు — తెలతెలవారుతోంది. దగ్గర కొచ్చేసిందన్న సంతోషం. ఇంతలో కొన్ని ఖనిజాలు కొట్టుకొస్తున్నాయ్. కెరటం వీరి వేపేవస్తోంది. సహృదయా! వస్తోంది అనేసి తెడ్డొదిలేసి ఆమెను గట్టిగా కౌగలించుకొన్నాడు. అంతే మళ్ళా వాళ్ళ పడిప నీటిమీద కనుపించలేదు. మళ్ళా కనపడింది ఉత్తపడవ.

ప్రేయసీ ప్రియులు విడువని కౌగిలిలో మునిగిపోయేరు. స్వార్థసంఘం పాడులోకం వారిని విడగొట్టినా, విడువని కౌగిలిలో ప్రియుల్ని గంగాదేవి ఆహ్వానించింది.

* * * *

''అదేమిటండీ వెక్కి వెక్కి ఏడుస్తున్నారు. లెండీ అని బుజంపట్టుకు ఊపేదాకా నాకు తెలివిరాలేదు. వెర్రిగా నలువైపులా చూసే దీపం తలదగ్గరేవుంది. చదువుతూన్న 'మొపాసా' నా ప్రక్కనే సేవించేడు.



ఏమిటలా వెర్రిగా చూస్తున్నారు అబ్బే! ఏం లేదు! అని అనేసి తప్పుకుందామని చూసినా మా ఆవిడ వొదిలేలా కనపడలేదు. అంచేత నా స్వప్నాన్నామెకు పూసగుచ్చినట్లు చేప్పేటప్పటికి తెలతెలవారుతోంది. అప్పుడే దాసీది కేక వేయటం మూలాన్నామె వెళిపోయింది. కాని నాకాస్వప్నం ఒక వాస్తవిక ప్రపంచాన్ని సృష్టించింది.